
# సినీ బేతాళ కథలు

## - డా. కె.వివేకానందమూర్తి





*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

### - 30 -

### - *భళారే చిత్రం!* -

**విక్రమార్కుడు** మళ్లీ బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని నడక సాగించాడు.

'విక్రా! దారిలో నువ్వు శ్రమ కాస్త మరిచిపోయేలా మరో కథ చెబుతాను విను!' అని బేతాళుడు ప్రారంభించాడు.

"తీసేరావు అనే నిర్మాత అనేక తెలుగు చిత్రాలు తీసి, వాటిని ప్రేక్షకులు ఆదరించక చీదరించుకున్నారని బాగా క్రుంగిపోయాడు. కాస్త మనసు తేలిక పడుతుందేమోనని బీచ్‌కి వెళ్లి వొక బెంచీ మీద కూర్చుని సముద్రంకేసి చూస్తూ వున్నాడు. కాసేపటికి చూసేరావు అనే ప్రేక్షకుడు వొక చేతిలో విస్కీసీసా, మరో చేతిలో గ్లాసు ధరించి వచ్చి అదే బెంచీమీద తీసేరావు పక్కన కూర్చున్నాడు.

కూర్చుని 'అయ్యా! కంపెనీకి మందేస్తారా?' అని అడిగాడు.

'ఏ మందు?' అన్నాడు తీసేరావు.

'ఏమీ అనకండి. గ్రోలండి!' అని చూసేరావు గ్లాసులో విస్కీ వడ్డించి యిచ్చాడు.

'మరి మీ గళాసు!' - తీసేరావు.

'ఇదుగో ఈ శంఖంలో పోసుకుంటాను.' అని యిసకలో కనిపించే వొక చిన్న శంఖాన్ని తీసి దులిపి అందులో మందుపోసుకుంటూ - 'శంఖంలో పోస్తేగాని తీర్థంకాదన్నారు కదా!' - అన్నాడు చూసేరావు.

'నేను మావూలుగా తాగనండి - యిలా సీటికోమాటికో -' తీసేరావు.

'అదేం?' చూసేరావు.

'నాకో సవస్సుందండి'

'ఏవిటో ఆ సమస్య?'

'ఎంతుచ్చుకున్నాసాల్లండి.'

'నాకూ వొక సమస్యవుందండి.'

'ఏటది?'

'నాకు మాంఛి తెలుగు సినిమాలు చూసే అలవాటండి. అసలు పేరు చూసేరావండి. చూడబుల్ తెలుగు సినిమాలు యీ మధ్య బాగా కరువైపోయి, బెంగెట్టుకుని మందుకి సెటిలయిపోయానండి.'

'మరి నా పేరు తీసేరావు. ఎన్నో సిత్రాలు తీసా. కరమ. అయన్నీ ఫ్లాపులే. నాయేకాదు - నాతోటి నిరుమాతగాల్లవి కూడా ఫెయిలింగులే. ఏనాకొడుక్కి యే సిత్రం కావాలో యెదవది తెలిసిసావడంలేదు.'

ఇద్దరూ రెండు గుండ్రాలు బిగించారు. తీసేరావన్నాడు - 'సూశారా! మనెదురుగా తెలుగు సినేమా పరిశ్రమవంత సముద్రం వుంది. మునగడవే తప్ప తేలే వుపాయం తేలడంలేదు.'

చూసేరావన్నాడు - 'ఈ సముద్రం తెలుగు సినిమా పరిశ్రమ కాదండి. ఈ నీళ్లన్నీ మంచి తెలుగు సినిమా లేదని ఏడిచే ప్రేక్షకుల కన్నీళ్లు. కావాలంటే టేస్టుచైండి. వుప్పగా వుంటాయి.'

ఇద్దరూ మరో రౌండు వేసుకున్నారు. తీసేరావన్నాడు - 'ఒరే - సూసేరావ్ - వొరే అన్నానని ఏవనుకోబోక. నువ్వు కూడా నన్ను వొరేయ్ అని పిలిసెయ్. నేను నిరుమాతని. నివ్వు పేచ్చక దాతవి. ఇద్దరం కలిసిపోయి కొత్త కతల్తో సెడుగుడి ఆడేద్దాం.'

'కథల్లో కొత్తవీ పాతవీ అంటూ వుండవురా తీసే నా కొడకా! పనంతా తీసి చూపించే పద్ధతిలోనే వుంటుంటుంది.'

'సెబాసో పేచ్చకా! సెబాసు - కానీ అలాంటి డవిరెట్టరుగాల్లు దొరికి సావడంలా' - తీసేరావు.

'వెతకాలి మిత్రమా! వెత్కాలీ!' - చూసేరావు.

బీచ్‌లో యింకా యెండ తగ్గలేదు.

తీసేరావు, చూసేరావు కూర్చున్న బెంచీ యెదురుగా యెగిరిపడే కెరటాల దగ్గర యేడేళ్ల కుర్రాడొకడు అటూ యిటూ పరిగెడుతూ ఆడుకుంటున్నాడు. కెరటం బీచ్‌లో యిసుక మీదికి పాకినప్పుడల్లా కొన్ని పీతలు కొట్టుకొస్తున్నాయి. కెరటం వెనక్కి వెళ్లినప్పుడు ఆ కొన్ని పీతల్లో కాసిని మాత్రమే మళ్లీ సముద్రంలోకి వెళ్తున్నాయి. ఇసుక మీద మిగిలిపోయిన పీతలు కొన్ని వెల్లకిలా పడి, కొన్ని బోర్లాపడి యిసుకమీద యెండవేడికి వేగుతూ పోయే ప్రాణాలకోసం గిలగిల్లాడుతున్నాయి. అవి ప్రేక్షక సముద్రం విసిరేసిన ఫెయిలయిన చిత్రాల్లా మగ్గిపోతున్నాయి. అటూ యిటూ పరుగెట్టే కుర్రాడు గిలగిలా కొట్టుకునే పీతని పట్టుకుని మళ్లీ సముద్రంలోకి విసిరేస్తున్నాడు. ఒక పీతని విసిరితే వంద పీతలు మళ్లీ వెనక్కి యెండ కాల్చే యిసుకమీదికి కెరటాలతో కొట్టుకొస్తున్నాయి.

మందు తపస్సులో మంచి తెలుగు సినిమాలకోసం మధనపడుతున్న తీసేరావుకి, చూసేరావుకి ఆ పరిగెట్టే యేడేళ్ల కుర్రాడి ఆట, యేదో అంతరాయంలా అనిపిస్తోంది. చూసేరావుకి మాటలు మందుగిస్తున్నాయి. తీసేరావుకి కిక్కు తిక్క మొహం వేస్తోంది.

ఆ కుర్రాడు పీత తర్వాత పీతను సముద్రంలోకి విసురుతున్నాడు. మళ్లీ వందల పీతలు వెనక్కి వేడి యిసుక మీదికి కొట్టుకొచ్చి ప్రాణాల కోసం కొట్టుకుంటున్నాయి.

తీసేరావు చిరాగ్గా అరిచాడు - ఆ పిల్లవాడిని అదమాయిస్తూ - 'ఒరే యెదవా! ఏటాపని? య్రెరిముకమా! వొక్క పీతని యిసిరితే వంద పీతలు యెనక్కొస్తున్నాయి. సత్తన్నాయి. ఏటా డిఫరెన్సు? యెల్లు - యెదవ నూసెంసుసైక యింటికెలిపో! - మనస్సాంతికీడకొత్తే యిక్కడా యింటరు ఫైరింగులే!' - అన్నాడు.

అప్పుడు ఆ కుర్రాడు తీసేరావుని తీసిపారేసినట్టు చూశాడు. బీచ్ యిసుక మీదికొచ్చి గిలగిలాకొట్టుకుంటున్న వొక పీతని తీసిపట్టుకుని, తీసేరావుతో - 'ఒరేయ్ ముస్సిలి నా కొడకా! యిలా చూడు!' అని తన చేతిలో పీతను సముద్రంలోకి బాగా కెరటాలకందనంత దూరంగా విసిరేసి అన్నాడు - 'యిప్పుడది బతికిందా - ముసిలెదవా? అదీ డిఫరెన్సు'

తీసేరావు కోపంగా బెంచీమీంచి లేచి వూగాడు. ఆ వూపు కోపానిదో నిషాదో తెలీదు.

ఆ కుర్రవాడు పదడుగులు పరుగెత్తి, ఆగి, వెనక్కి తిరిగి తీసేరావుతో అరుస్తూ అడిగాడు -

'ఒరేయ్ - ముసిలాడా, నేనిప్పుడు సముద్రంలోకి విసిరేసిన ఆ పెద్ద పీత పేరేంటో తెలుసా?'

- చూసేరావు అడిగాడు - 'మా యిద్దరికీ తెలియదు. ఏవిటి?'

'బాహుబలి 2 ది కంక్లూజన్' అని మళ్లీ వెనక్కి తిరిగి చూడకుండా పరిగెత్తేశాడు. తీసేరావుకి, చూసేరావుకి ముఖాలమీద కత్తివాటుకి విస్కీ చుక్కలేదు - అదీ విషయం.

విక్రమార్కా! ఇప్పుడు చెప్పు! తెలుగులో గొప్ప చిత్రాలు వస్తున్నాయా? రావటంలేదా? ఈ ప్రశ్నకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీ తల వెయ్యి చెక్కలయి వాటిని నువ్వు యేరుకుని అతికించుకోవలసి వస్తుంది -" అని ముగించాడు బేతాళుడు.

బదులుగా విక్రమార్కుడు - " ఓ! బేతాళా! నువ్వు నా భుజం మీద వున్నంతవరకూ నాకు సమాధానం తట్టని ప్రశ్నలు యింకా పుట్టలేదు మామా! వంద పీతలు వొడ్డున యెండలోపడి బ్రతక్కపోతే వాటిని తెలుగు సినిమాలంటారు. ఒక్క పీత ప్రేక్షక సముద్రంలో పరవళ్లతో పరవశింప చేస్తూంటే దాన్ని యింటర్నేషనల్ మూవీ అంటారు ఆ పీతకి ప్రాణం పోసి బాహుబలిని చేసిన ఆ కుర్రాణ్ని రాజమౌళి అంటారు.

ఇప్పుడు తెలుగు సినిమా సకల దేశాలకూ వినిపించేలా పుంఖాలు తెంచుకుని శంఖం పూరించింది.

- కాశ్యశ్చ పరమేష్వాసః<br>
శిఖండీ చ మహారథః ।<br>
ధృష్టద్యుమ్నో విరాటశ్చ<br>
సాత్యకిశ్చా పరాజితః॥

మహా విలుకాడగు కాశీరాజు, మహారథుడగు శిఖండి, ద్రుపద పుత్రుడగు ధృష్టద్యుమ్నుడు, విరాటరాజు ఓటమి నెఱుగని సాత్యకి మొదలగు వీరులందరు కూడ శంఖములు పూరించిరి - అన్నారోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణభగవానుడు -"

అని సమాధానం చెప్పగానే రాజుకి మౌనభంగం కలిగి, బేతాళుడు తెలుగు సినిమాలా తెల్ల నల్ల దేశాలన్నీ యెగిరి బాక్సాఫీసు చెట్టు చిటారు కొమ్మెక్కేశాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments